క్లుప్తంగా

గడువులోపు అర్జీలు పరిష్కరించాలి



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్పందన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయం లోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు అధికారులను కలిసి వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. మున్సిపల్ ఎస్ ఈ వేణుగోపాల్, నగరపాలక డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

శబరిమలకు మేయర్

కర్నూలు (కల్చరల్): నగర మేయర్ బీవై రామయ్య ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలై వెళ్లారు. అక్టోబర్ 25వ తేదీన ఆయన అయ్యప్పస్వామి మాల ధరించారు. సోమవారం ఎ.క్యాంప్‌లోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముడి కట్టుకుని శబరిమలైకు బయలుదేరారు. కాగా శుక్రవారం తిరిగి ఆయన నగరానికి రానున్నారు.

భగవద్గీత పఠన పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న మాంటిస్సోరి స్కూల్ హెచ్ఎం స్వర్ణలత

కర్నూలు సిటీ: కర్నూలు చిన్మయ మిషన్, చిన్మయ సేవా ట్రస్ట్ (హైదరాబాద్) ఇటీవల నిర్వహించిన భగవద్గీత జిల్లా స్థాయి పఠన పోటీల్లో విద్యానగర్ మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు బి. పాల్గొని ప్రతిభ కనబరిచారు. 9వతరగతి చదువుతున్న బి. నిత్యశ్రీ హర్షిణి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా ఐదవ తరగతి చదువుతున్న కె.సాయి రేష్మంత్ రెడ్డి తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ ఇద్దరిని సోమవారం మాంటిస్సోరి స్కూల్ హెచ్ఎం కె. స్వర్ణలత, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. భగవద్గీత పఠనం ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు నైతిక విలువలు పెరుగుతాయని హెచ్ఎం తెలిపారు.

టీవీ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడికి సన్మానం

కర్నూలు కల్చరల్ : టీవీ మెకానిక్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీవీ మెకానిక్ యూనియన్ నాయకులు ఆర్‌కే రెడ్డి, కన్నయ్య శెట్టి, జనార్దన్, జయరాం, శ్రీనివాసులు, విజ్ఞిశెట్టి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి

కర్నూలు(అగ్రికల్చర్): దేశీ డిప్లొమ కోర్సు పూర్తి చేసిన ఇన్‌పుట్ డీలర్లు రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన ఇన్‌పుట్ డీలర్లకు సోమవారం ఆమె సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, దేశీ కార్యక్రమ సమన్వయ కర్తలు నాగేంద్రయ్య, జయచంద్ర, రిటైర్డ్ డీడీఏ భగవత్‌స్వరూప్, ఆత్మ ఏవో మధుమతి తదితరులు పాల్గొన్నారు.

11,12న ఆశా వర్కర్ల సమ్మె



ఏఓ అరుణకు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా వర్కర్లు

కర్నూలు(హాస్పిటల్): సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11, 12వ తేదీల్లో సమ్మె చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏఓ అరుణకు ఆశా వర్కర్లు సోమవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు వంటా వార్పు కార్యక్రమం ద్వారా సమ్మెలో నిరసన తెలుపుతామని వారు పేర్కొన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జె.నాగేశ్వరరావు, నాయకులు నాగార్జునమ్మ, ఈశ్వరీబాయ్, శాంతకుమారి, సీఐటీయూ జిల్లా నాయకులు విజయ్ సాములు ఉన్నారు.

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కర్నూలు (న్యూటౌన్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని వర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు అన్నారు. వర్సిటీ భూములపై ఓ పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఖండిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్సిటీ భూముల్లో కొంత స్థలాన్ని పర్యాటక రంగం అభివృద్ధికి కేటాయిస్తున్నారన్న విషయంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

కాన్పు..ఆసుపత్రే సేఫ్

- పెరిగిన అవగాహన..ఇళ్ల వద్ద తగ్గిన ప్రసవాలు
- మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- కాన్పులకు ఆరోగ్యశ్రీ వర్తింపు
- వంద శాతం ఆసుపత్రుల్లోనే జరుగుతున్న ప్రసవాలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగం

కర్నూలు(హాస్పిటల్): పాతిక, ముప్పై ఏళ్ల క్రితం పురిటినొప్పులు వస్తే ఆసుపత్రికి వెళ్లే వారు ఏ కొద్దిమందో. కానీ ఇప్పుడు పురిటినొప్పులు అలా మొదలవగానే ఆసుపత్రికి వెళ్తున్నారు. కొందరు మూడు రోజులు ముందుగానే వెళ్తున్నారు. ప్రజల్లో పెరిగిన అవగాహనతో పాటు వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ వర్తింపజేస్తుండటం ఈ మార్పునకు కారణమైంది. ప్రస్తుతం వంద శాతం కాన్పులు ఆసుపత్రుల్లోనే జరుగుతుండటంతో మాతాశిశు మరణాలు సైతం తగ్గుముఖం పడుతున్నాయి.

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి, ఆదోని ఎంసీహెచ్‌తో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవే గాక గుర్తింపు పొందిన జిల్లాలో 60కి పైగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ కాన్పులు చేస్తున్నారు. వీటిలో కొన్నింటికి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సౌకర్యం ఉండటంతో గర్భిణులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రసవాలు చేయించుకుంటున్నారు. ఆసుపత్రి ప్రసవాలు పెరగాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటు ప్రైవేటు ఆసుపత్రులతో పాటు అటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సౌకర్యం ఏర్పాటు చేసింది. దీంతో ఇటీవల కాలంలో ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఇంటి వద్ద కాన్పులు చేయించుకునే వారు సైతం ఇప్పుడు ఆసుపత్రులకు వస్తున్నారు.

ఆసుపత్రుల్లో ప్రసవాలకే మొగ్గు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019–20 సంవత్సరంలో 64,143 మంది ప్రసవించగా అందులో 99.49 శాతం ఆసుపత్రిలోనే ప్రసవించారు. అలాగే 2020–21లో 78,960 మంది ప్రసవించగా 99.47శాతం, 2021–22లో 43,637 (కర్నూలు జిల్లా మాత్రమే) మంది ప్రసవించగా 99.90శాతం మంది, 2022–23లో 33,333 మంది ప్రసవించగా వందశాతం, 2023–24లో గత సెప్టెంబర్ వరకు 23,860 మంది ప్రసవించగా అందరూ ఆసుపత్రుల్లోనే కాన్పు అయ్యారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 13,183 మంది, ప్రైవేటు ఆసుపత్రుల్లో 10,677 మంది ప్రసవించారు.

ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలు అధిక శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. నిపుణులైన వైద్యులు, నర్సులు, సిబ్బంది ఉండటం, నిరంతరం పర్యవేక్షణ ఉంటుందనే ఉద్దేశంతో పాటు ఆసుపత్రిలో ప్రసవం అయితే రూపాయి ఖర్చు ఉండకపోవడంతో పాటు రూ.6 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే ప్రతిరోజూ 30 నుంచి 35 ప్రసవాలు జరుగుతుండగా ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో 10 నుంచి 20 దాకా ప్రసవాలు జరుగుతున్నాయి. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో అక్కడి వైద్యసిబ్బంది ఆధారంగా ప్రతిరోజు ఒకటి నుంచి 5 మంది ప్రసవిస్తున్నారు. ఈ యేడాది జిల్లా మొత్తంగా ఇప్పటి వరకు 15,150 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగాయి.

ఆసుపత్రిలో ప్రసవం సురక్షితం



ఇంటి వద్ద ప్రసవం చేయించుకుంటే ప్రాణం మీదకు వచ్చే అవకాశాలే ఎక్కువ. అదే ఆసుపత్రుల్లో అయితే డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుంది. కాబట్టి గర్భిణులు అవసరమైతే రెండు, మూడు రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలి. గర్భిణి ఇంటి నుంచి ఆసుపత్రికి రావడానికి 108 అంబులెన్స్, డిశ్చార్జ్ అనంతరం ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ఉంటుంది. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక 24వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీనగర్, పాలకొట్టాల ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు చెప్పిన సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ ఆసీఫ్, రాజు, సునీల్, సుచరిత, అర్చన, అబ్బాస్ అలీ, అనీస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా కలవండి

నగర ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తనను నేరుగా కలిసి పరిష్కారం పొందవచ్చని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలతో పాటు వైద్య, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన సమస్యలు విని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు

వై నాట్ 175కు మద్దతుగా పాదయాత్ర చేపట్టిన మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టేపోగు బసవరావు సోమవారం ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను కలిశారు. అంతకు ముందు ఆయన పాదయాత్ర కర్నూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం వరకు పాదయాత్ర చేయనున్నట్లు బసవరావు తెలిపారు.ఇందులో భాగంగా కర్నూలుకు చేరుకున్న ఆయనను వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర నాయకులు సీహెచ్ మద్దయ్య, సునీల్, ధనుంజయ ఆచారి, లక్ష్మీకాంతం, ఎంఆర్‌పీఎస్ నాయకులు జానయ్య స్వాగతం పలికారు.

శాంతిపరులు క్రైస్తవులు



క్యాండిల్ లైటింగ్ ఐక్య ఆరాధన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్) : క్రైస్తవులు శాంతిని కాంక్షించే వారు అని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక రాక్‌వుడ్ చర్చిలో కర్నూలు నగర పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ లైటింగ్ ఐక్య ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం నగర పాస్టర్ల అసోసియేషన్ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, నగర పాస్టర్లు రెవరెండ్ ఆర్ఆర్‌డీ సజీవరాజు, పాల్ ఆగస్టీన్, యేహోషువా, జాన్ సెరెల్లో, ఏసుబాబు, జార్జిరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా విజేతలకు అభినందన

కర్నూలు (టౌన్) : స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాయలసీమ యూనివర్సిటీ స్థాయి హ్యాండ్‌బాల్ , సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఉస్మానియా కళాశాల విద్యార్థులను ఆ విద్యా సంస్థ కరస్పాండెంట్ అజ్రా జావెద్ అభినందించారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమె మాట్లాడుతూ చదువుతో పాటుక్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీని వల్ల భవిష్యత్తులో మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సలీమ్ సమీయుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రఫీక్ అహమ్మద్ పాల్గొన్నారు.

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

కర్నూలు (టౌన్) : గత నెల 17 నుంచి 20వ తేదీ వరకు శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించిన ఏపీ అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ చాటారు. వీరేష్ (బంగారు పతకం), అబ్దుల్లా, పర్వేజ్ (వెండి పతకం), నాగమణి (కాంస్య పతకం) సాధించారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన వెయిట్‌లిఫ్టర్లను సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని వ్యాయామహాలులో అసోసియేషన్ సభ్యులు శివరాం గౌడ్ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పాప, అంజనేయగౌడ్, నాగరాజు, వేణు, రమణ, కోచ్ యూసుఫ్ పాల్గొన్నారు.



గెలుపొందిన రాష్ట్ర జట్టుతో నగర మేయర్ బీవై రామయ్య

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్) : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. రెండు రోజుల పాటు స్థానిక దేవీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల కరాటే చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఇందులో రాష్ట్ర జట్టు విజేతగా నిలవగా తెలంగాణ జట్టు రన్నర్ స్థానంలో నిలిచింది. ఆయా జట్లకు నగర మేయర్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి కోలా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

జాతీయస్థాయి చిల్డ్రన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ

కర్నూలు(కల్చరల్) : పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి చిల్డ్రన్స్ ఫెస్టివల్‌లో టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమి చిన్నారులు ప్రతిభ కనబరిచారు. వారిని సోమవారం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. అకాడమి అధ్యక్షుడు భార్గవ్ కుమార్ పాల్గొన్నారు.

కంప్యూటర్ స్కిల్స్‌పై శిక్షణ

కర్నూలు సిటీ: కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీకి చెందిన జూనియర్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సు విద్యార్థులకు నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషనల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కంప్యూటర్స్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డా.రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యతో పాటు సాంకేతిక అంశాల్లో విద్యార్థులకు నైపుణ్యం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ కాలేజీ అధ్యాపకులు నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సీతారామయ్యకు సన్మానం

కర్నూలు (హాస్పిటల్) : యూరాలజీ వైద్యుల అసోసియేషన్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా ఎన్నికైన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యూరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్యను ఘనంగా సన్మానించారు. సోమవారం ఆయన చాంబర్‌లో తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలుకు చెందిన వైద్యుడు రెండు రాష్ట్రాలకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో ఆయన జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

భూ హక్కుల చట్టం రద్దు చేయాలి

కర్నూలు (లీగల్) : నూతన భూ హక్కుల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు విధులను బహిష్కరించి స్థానిక న్యాయవాద సంఘం కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. జూనియర్ న్యాయవాదులు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం చేశారు

- స్పందనలో ఏఎస్పీకి బాధితుల ఫిర్యాదు



స్పందనలో ఏఎస్పీకి సమస్యలు చెప్పుకుంటున్న బాధితులు

కర్నూలు : నందికొట్కూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకుని కర్నూలు ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రసాదరావు మోసం చేశాడని, సంఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని గుంతకల్లు పట్టణానికి చెందిన ఎర్రిసామి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్‌కు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 60 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి చట్ట పరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుల్లో కొన్ని..

- రాయలసీమ యూనివర్సిటీలోని లైబ్రరీలో నా భర్తకు అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని ఏసు అనే వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని, విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- తాను బీఈడీ చదువుకున్న నిరుద్యోగినని, డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న తరుణంలో ప్రవీణ్, నాగన్న అనే వ్యక్తులు తనకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.లక్ష తీసుకుని మోసం చేశారని కర్నూలు బుధవారపేటకు చెందిన ఎస్.నారాయణ ఫిర్యాదు చేశారు.
- నగర శివారులోని వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలో ఉన్న శ్రీసాయి వెంచర్‌లో అక్రమంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొంతమంది గుడిసెలు వేసుకుని దౌర్జన్యం చేస్తున్నారని కర్నూలుకు చెందిన చిన్న మాధవస్వామి, నాగరాజు, గోపాల్ ఫిర్యాదు చేశారు.
- నగర శివారులోని ఉల్చాల రోడ్డులో ఉన్న 4.85 ఎకరాల భూమిని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ జేసీబీతో క్లీన్ చేసి ఆక్రమించుకోవడానికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు శ్రీనగర్‌కు చెందిన రవికుమార్ ఫిర్యాదు చేశారు.

నకిలీ సర్టిఫికెట్ల దందాను అరికట్టండి

- కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, ప్రజా సంఘాల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్): పశు సంవర్ధకశాఖ ఉద్యోగాల భర్తీలో నకిలీ సర్టిఫికెట్ల దందాను అరికట్టాలని పలు విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం ఆర్‌వీపీఎస్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో అనిమల్ హజ్‌బెండరీ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ పోస్టుల భర్తీకి రెండు సంవత్సరాల వెటర్నరీ పాలిటెక్నిక్, డైరీ సైన్స్, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులను క్వాలిఫికేషన్‌గా నిర్ణయించిందన్నారు. అయితే, అనేక మంది నిరుద్యోగులు ఒక్కొక్కరు లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు వెచ్చించి భారత్ సేవక్ సమాజ్ అనే సంస్థ ద్వారా నకిలీ ధ్రువపత్రాలు కొనుగోలు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. మరి కొందరు పశు సంవర్ధకశాఖలో పనిచేస్తున్న డీఈఓ, గోపాల మిత్ర సూపర్‌వైజర్లు, అవుట్ సోర్సింగ్ అటెండెంట్లు రెగ్యులర్ ప్రాతిపదికన రెండు సంవత్సరాల డైరీ కోర్సును పూర్తి చేసినట్లు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ విషయాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని వారు జిల్లా జాయింట్ కలెక్టర్, పశు సంవర్ధకశాఖ జేడీకి వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆర్‌వీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు మగ్బూల్, వెంకటేశ్వర్లు, సుధాకర్, జయరాం, గోపాల్, హరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కురువ మహిళా సంఘం అధ్యక్షురాలిగా లీలమ్మ



టి. లీలమ్మ



అనిత

కర్నూలు(అర్బన్): కురువ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా టి.లీలమ్మ, ప్రధాన కార్యదర్శిగా అనితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తారన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మహిళల సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

10న భట్టురాజు సంక్షేమ సంఘం వనభోజనాలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 10వ తేదీన భట్టురాజు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన కార్యక్రమాలను స్థానిక కోడుమూరు రోడ్డులోని నెరవాడ శ్రీ దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర నాయకులు కూడా హాజరవుతున్నారని, భట్రాజు కుల వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేశామన్నారు. అవివాహితులైన పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా పరమశివునికి రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, ఉసిరి చెట్టుకు పూజ, 2024 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలతో పేదల్లో ఆనందం



జగనే ఎందుకు కావాలంటే అనే బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేదార్‌నాథ్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో ఆనందం నింపాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర క్లస్టర్–2 అధ్యక్షుడు కేదార్ నాథ్, మాజీ మేయర్ బంగి అనంతయ్య అన్నారు. సోమవారం స్థానిక 16వ వార్డు జవార్ వీధిలో జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం పథకాల అమలులో పారదర్శకత ఉండేది కాదని, జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే అందేవన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూర్యుడు, బాబర్, క్రాంతికుమార్, దినకర్, అమీర్ పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతోత్సవం



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గాన కళాసమితి బృందం

కర్నూలు (కల్చరల్) : పద్మశ్రీ ఘంటసాల 101వ జయంతోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి ఆధ్వర్యంలో చిన్నపార్కు సమీపంలో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ డబ్ల్యూ సీతారాం, ఘంటసాల గాన కళా సమితి ఉపాధ్యక్షుడు కురాడి చంద్రశేఖర్ కల్కూర హాజరై ప్రసంగించారు. చలన చిత్ర సంగీతానికి కొత్త ఒరవడిని తెచ్చారు. వారు పాడిన భగవద్గీత ప్రపంచ ప్రసిద్ధి గాంచిందన్నారు. ఘంటసాల గొప్ప సంగీత శాస్త్రజ్ఞుడు, కళాకారుడు అన్నారు. మధురకవి ఎలమర్తి రమణయ్య, బీఎస్ రావు ఘంటసాల పాడిన పాటలను మధురంగా ఆలపించారు. పద్మశ్రీ ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు సుస్వరం వాసుదేవ మూర్తి, సభ్యులు జగన్నాథ గుప్త, కేసీ రాముడు, సత్య ప్రసాద్, కేజీ గంగాధర్ రెడ్డి, హనుమంతరాయ చౌదరి, రాఘవేంద్ర ప్రసాద్, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

కర్నూలు కల్చరల్ : ఘంటసాల 101వ జయంతి సందర్భంగా సోమవారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల చిత్రపటానికి కవులు, కళాకారులు పులమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్రను కొనియాడారు. ఘంటసాల పాట లు పాడి వినిపించారు. కార్యక్రమంలో ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షుడు బి.సత్యనారాయణరా వు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం

కల్లూరు: వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమని కల్లూరు అర్బన్ క్లస్టర్–2 అధ్యక్షుడు, కార్పొరేటర్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధురి, నరసింహులు, నాయకులు కృష్ణమూర్తి, మిద్దూరు శ్రీనివాసులు, సంగమేశ్వరావు, హనుమంతయ్య పాల్గొన్నారు.

20వ వార్డులో

కల్లూరు అర్బన్ పరిధిలోని 20వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు అర్బన్ క్లస్టర్–1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనకు తేడా గమనించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

చికెన్‌షాపు యజమానుల కడుపు కొట్టొద్దు

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు టెండర్లు పిలిచి వ్యర్థ పదార్థాలను టెండర్ పాడుకున్న వ్యక్తికి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసి చికెన్‌షాపు యజమానుల కడుపు కొట్టొద్దని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని చికెన్‌షాపుల యజమానులు, సీపీఐ నేతలు కలిసి అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీగా వచ్చి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

ప్రకటన / హెచ్చరిక

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా కర్నూలు సిటీ, అశోక్ నగర్, మోక్షసాయి అపార్ట్ మెంట్ వాస్తవ్యులైన బి.ఏసుదాస్ అను నా క్లయింటు షెడ్యూలు దాఖలా భూమి యజమానులైన కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, నన్నూరు గ్రామ నివాసి అయిన late జి.నాగన్న సంతతి అయిన జి.పెద్ద నాగశేషులు, శ్రీమతి జి.నాగేంద్రమ్మ, జి.నాగశేషులు, జి.నాగేంద్రమ్మ @ పి.లక్ష్మీదేవి, జి.నాగేంద్ర, late జి.నడిపి నాగ శేషులు వారసులైన జి.అపర్ణ, జి.నాగరాజు మరియు జి.నగేష్‌లు షెడ్యూలు దాఖలా భూమిని అమ్మకముగా నా క్లయింటు వారితో 12-12-2015వ తేదీన సదరు భూమి కొనుగోలు విషయమై అగ్రిమెంటు వ్రాసుకున్న తరువాత అగ్రిమెంటు షరతుల ప్రకారము నడుచుకొని రిజిస్టరు చేయక తప్పినందున మరియు వాస్తవాలను కప్పిపుచ్చినందున పైన కనపరచిన వారందరిపై నా క్లయింటు కర్నూలు మొబైల్ కోర్ట్/ III A.J.C.J.C నందు O.S.No.1084/2022 అను దావాను దాఖలు చేయగా సదరు కేసు ప్రస్తుతం విచారణలో వున్నది. ఇట్లుండగా భవిష్యత్తులో షెడ్యూలు దాఖలా భూమిని చట్టపరముగా కోర్టు ద్వారా నా క్లయింటు రిజిస్టరు పొందుటకు ఆటంకాలు కల్పించుటకై పైన కనబరిచిన జి.పెద్ద నాగశేషులు మరియు ఇతరులు షెడ్యూలు దాఖలా భూమిపై గల కోర్టు వ్యవహారములను కప్పిపుచ్చి, నా క్లయింటుకు కూడా తెలియకుండా గోప్యముగా ఇతరుల పేరట రిజిస్టరు విక్రయ పత్రము సృష్టించి, నా క్లయింటును ఇబ్బంది పెట్టుటకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసినది. కావున షెడ్యూలు దాఖలా భూమి విషయములో నా క్లయింటు ప్రమేయము లేకుండా కోర్టు వ్యవహారము పెండింగులో వుండగా ఎవరేగాని సదరు జి.పెద్ద నాగశేషులు మరియు ఇతరులతో ఎలాంటి ఒప్పందాలు కాని, దాన విక్రయాది ఆయకవు, అప్పు పత్రములు కానీ లేదా ఇతరత్రా ఎలాంటి ఒప్పందాలు కానీ, రిజిస్టరు పత్రములను కానీ చేసుకొన్న యడల అవి చెల్లబోవని భవిష్యత్తులో పై కోర్టు తీసుకునే నిర్ణయాలకు మరియు నా క్లయింటు తీసుకునే సమస్త సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బద్ధులగుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, నన్నూరు గ్రామ పరిధిలోని పట్టా నెం.55 లోని, గత సర్వే నెంబరు: 1174-ఏ లోని ఎ.1-80 సెంట్ల భూమికి ప్రస్తుత సర్వే నెంబరు 1413-1 లోగల ఎ.1-37 సెంట్లలో భూమికి చెక్కుబంది. **తూర్పు:** రోడ్డు, **పడమర:** నడిపి రోషన్నకు చెందిన భూమి, **ఉత్తరము:** రోడ్డు, **దక్షిణము:** బోయ సుబ్బరాయుడికి చెందిన భూమి.

ఎం.ఇంద్ర విజయ రావు, B.A., B.L.,
అడ్వకేట్, కర్నూలు. సెల్: 949140 8389, 63006 91648.